సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024

సండే స్పెషల్


పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జింకలు, దుప్పులకు అడ్డాగా నిలుస్తోంది. అడవిలో మాత్రమే కనిపించే చుక్కల జింకలు, దుప్పులు మూడింటిని ఇక్కడ ఏర్పాటుచేసిన పార్క్‌లో వదలగా వాటి సంతతి నానాటికీ పెరుగుతుండడంతో సందడి చేస్తున్నాయి. శరీరంపై తెల్లని మచ్చలు, కొమ్ములతో అందంగా కనిపిస్తూ చెంగు చెంగున గంతులేసే జింకలు, దుప్పులకు ఆవాసంగా మారిన కిన్నెరసాని పార్క్ ఏర్పాటై నేటితో యాభై ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.



పార్క్‌లోని జింకలు, దుప్పులు

కిన్నెరసాని.. జింకల అడ్డా!





కిన్నెరసానిలో డీర్‌పార్క్ ముఖద్వారం (ఇన్‌సెట్) నాటి సీఎం జలగం వెంగళరావు ప్రారంభించిన శిలాఫలకం

డీర్ పార్క్ ప్రారంభమై నేటితో 50 ఏళ్లు

- 1974లో ప్రారంభించిన నాటి సీఎం వెంగళరావు
- నాడు మూడు జింకలు.. నేడు 135
- పర్యాటకుల రాకతో ఏటేటా పెరుగుతున్న ఆదాయం

సింగరేణి ఆధ్వర్యాన ఏర్పాటు...

పాల్వంచకు 12 కి.మీ. దూరంలోని కిన్నెరసాని గ్రామపంచాయతీ పరిధిలో పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని రిజర్వాయర్ వద్ద పర్యాటకుల సందర్శనార్థం సింగరేణి కాలరీస్ ఆధ్వర్యాన డీర్‌పార్క్‌ను ఏర్పాటుచేశారు. 14 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ పార్క్‌ను 1974 సెప్టెంబర్ 29న నాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. ఆతర్వాత 2012లో రూ.11లక్షల వ్యయంతో 720 మీటర్ల మేర ఇనుప కంచె నిర్మించారు. నాడు జింకలు, దుప్పులు కలిపి మూడింటిని వదలగా నేడు వాటి సంతతి 135కు చేరింది. ఇందులో ఆడవి 54, 81 మగ వాటితో పాటు 20 పిల్లలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీటికి తోడు ఇదే పార్క్‌లో ఐదు మూషిక జింకలు, కొండగొర్రెలు కూడా ఉన్నాయి.

పాతికేళ్ల క్రితం వైల్డ్‌లైఫ్ పర్యవేక్షణలోకి...

తొలుత జింకల పార్క్‌ను సింగరేణి ఆధ్వర్యాన ఏర్పాటుచేయగా సంరక్షణ, నిర్వహణ బాధ్యతలను సంస్థ 1998 వరకు చేపట్టింది. ఆతర్వాత 1999లో వైల్డ్‌లైఫ్ శాఖకు అప్పగించగా వారే పర్యవేక్షిస్తున్నారు. జింకల ఆహారం కోసం రెండు హెక్టార్ల విస్తీర్ణంలో గడ్డి పెంచుతున్నారు.

ఏడాదికోసారి సంతానోత్పత్తి

ఏటా జింకలు సంతానోత్పత్తి చేస్తాయి. ఆడ జింకలు ఏటా ఆగస్టులో పిల్లలకు జన్మనిస్తాయి. ఒక్కో విడతలో ఒకటి లేదా రెండు పిల్లలు జన్మిస్తాయి. కాగా, 2009లో పార్క్‌లోకి ఊరకుక్కలు దూరి తొమ్మిది జింకలను చంపేశాయి. ఈ ఘటనతో పార్క్‌కు ఇనుపకంచెను పటిష్టం చేశారు. అంతేకాక సామర్థ్యానికి మించి జింకలు ఉండడంతో అదే ఏడాది ఆరు జింకలను రంగాపురం అటవీ ప్రాంతంలో వదిలారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉండడంతో కొన్నింటిని అడవిలో వదిలేయాలనే ప్రయత్నాల్లో ఉన్నారు.

అరకొర నిధులు

డీర్ పార్క్‌లోని జింకలకు ఆహారం సమకూర్చేందుకు ప్రభుత్వం నుంచి అరకొరగానే నిధులు మంజూరవుతున్నాయి. దీంతో వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు ఆ స్థాయిలోనే ఆహారం అందిస్తున్నారు. ఫలితంగా జింకలు బక్కచిక్కుతున్నాయనే విమర్శలున్నాయి. రెండు పూటలా గడ్డి సమకూరుస్తున్నా లెక్కకు మిక్కిలిగా ఉన్న జింకలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో డీర్ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఏదైనా ఆహారం పెడతారని ఆశగా ఎదురుచూస్తుంటాయి.

రూ.2.76కోట్లకు పైగానే ఆదాయం

కిన్నెరసాని డీర్ పార్క్‌లోని జింకలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులు టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 2003–2004 నుంచి టిక్కెట్లు అమ్ముతుండగా ఇప్పటివరకు వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.2,76,23,281 ఆదాయం లభించింది. తొలి ఏడాది 2003–2004లో పర్యాటకుల ద్వారా రూ.2,46,194 ఆదాయం సమకూరగా, గడిచిన 2023–2024లో ఆదాయం రూ.36,37,795గా నమోదైంది.

విస్తీర్ణం పెంపు.. చైన్‌లింక్ కంచె



డీర్‌పార్క్ ఏర్పాటై నేటితో యాభై ఏళ్లు పూర్తికానున్నాయి. పార్క్‌లో జీవాల సంరక్షణకు విస్తీర్ణాన్ని మరో 6.5 కిలోమీటర్ల మేర పొడిగించాం. అంతేకాక రూ.1.25కోట్ల వ్యయంతో చైన్ లింక్ కంచె ఏర్పాటుచేశాం. జింకలకు ప్రతిరోజు పౌష్టికాహారం అందిస్తున్నాం. నీటి కోసం ప్రత్యేక చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. భద్రత కోసం రాత్రింబవళ్లు సిబ్బంది పహారా కాస్తున్నారు.

– కృష్ణగౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు అసిస్టెంట్ ఫోర్‌మెన్ పోస్టులకు రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 25 అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ (ఎలక్ట్రికల్) పోస్టులను ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేసేందుకు ఆదివారం రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు పర్సనల్ జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ రిక్రూట్‌మెంట్‌సెల్) ఎం. సామ్యేల్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసేందుకు సింగరేణి వ్యాప్తంగా గల 11 ఏరియాల నుంచి 180 మంది దరఖాస్తు చేసుకోగా 170 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ ఆధారంగా నిర్వహిస్తున్నామని, ఎలాంటి పైరవీలకు తావు లేదని స్పష్టం చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ఎవరైనా నమ్మబలికితే వారి వివరాలు తెలియజేయాలని కోరారు.

నేటి నుంచి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్

చుంచుపల్లి: భద్రాద్రి జోనల్ స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్‌ను ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నట్లు భద్రాద్రి జోన్ సీసీఎఫ్ డి.భీమానాయక్ తెలిపారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాది కొత్తగూడెం జిల్లాల అటవీ అధికారి నుంచి బీట్ ఆఫీసర్ స్థాయి వరకు ఉద్యోగులు పాల్గొననున్నారని వెల్లడించారు.

విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పాల్వంచ: కేటీపీఎస్ ఐదో దశలో సాంకేతిక సమస్యతో నిలిచిన విద్యుదుత్పత్తి శనివారం అందుబాటులోకి వచ్చింది. కర్మాగారంలో 250 మెగావాట్ల సామర్థ్యం గల 9వ యూనిట్, 7వ దశలో 800 మెగావాట్ల సామర్థ్యం గల 12వ యూనిట్ బాయిలర్ ట్యూబ్ లీకేజీలతో శుక్రవారం ఉత్పత్తి నిలిచిన విషయం తెలిసిందే. కాగా, మరమ్మతుల అనంతరం ఉత్పత్తిని తిరిగి రాష్ట్రగ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

లోక్ అదాలత్‌కు స్పందన

- జిల్లా వ్యాప్తంగా 4,313 కేసుల పరిష్కారం
- రాజీ మార్గమే మేలన్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్



బీమా చెక్కు అందజేస్తున్న జిల్లా జడ్జి పాటిల్

కొత్తగూడెంటౌన్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తెలిపారు. కొత్తగూడెం కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజీ మార్గంలో కేసుల పరిష్కారం ద్వారా డబ్బుతో పాటు సమయం ఆదా చేసుకోవచ్చని అన్నారు. జిల్లాలో 4,313 కేసులు పరిష్కారమయ్యాయని, వాటిలో క్రిమినల్ కేసులు 2,462 సైబర్ క్రైం 42, వాహన ప్రమాద కేసులు 26, బ్యాంకు రుణ రికవరీ 77, చెక్ బౌన్స్, పిటీ కేసులు, ఇతర కేసులు 1706.. మొత్తం 4313 కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు.

మృతుడి కుటుంబానికి రూ.73.14 లక్షల చెక్కు

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చుంచుపల్లి మండలం త్రీఇంక్లెయిన్ తండాకు చెందిన రవికుమార్ కుటుంబ సభ్యులకు జడ్జి పాటిల్ వసంత్ రూ.73,14,871 ప్రమాద బీమా చెక్కు అందజేశారు. 2022 ఫిబ్రవరి 14న రవికుమార్ సైకిల్‌పై పాల్వంచ నుంచి కొత్తగూడెం వస్తుండగా నవభారత్ సమీపంలో కారు ఢీకొట్టింది. క్షతగాత్రుడిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య వినోద కొత్తగూడెం కోర్టులో మోటార్ అక్సిడెంట్ కేసు దాఖలు చేయగా.. వారికి మంజూరైన చెక్కును ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పంజాగుట్ట బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ మోహన సమక్షంలో వినోదకు అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం ఇన్సూరెన్స్ న్యాయవాదులు కొత్తపల్లి రామారావు, గురజాల సీతారామారావు, శెట్టిపల్లి వెంకటరామారావు, అంబటి రమేష్ పాల్గొన్నారు. కాగా, కక్షిదారులకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ అందజేశారు.

డిసెంబర్ 1లోగా పనులు పూర్తి చేయండి

- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి కిన్నెరసానిలో అభివృద్ధి పనుల పరిశీలన



కిన్నెరసానిలో అద్దాలమేడను పరిశీలిస్తున్న టూరిజం ఎండీ, కలెక్టర్ పాటిల్

పాల్వంచరూరల్ : జిల్లాలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను డిసెంబర్ ఒకటో తేదీ నాటికి పూర్తి చేయాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కిన్నెరసానిలో అద్దాలమేడ, కాటేజీల పనులను కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఏయే పనులు పూర్తి కావాలి, ఎప్పటివరకు చేస్తారనే విషయాలపై టూరిజం ఇంజనీరింగ్ డీఈ రామకృష్ణను ఆరా తీశారు. డిసెంబర్ నెలాఖరు వరకు అగ్రిమెంట్ ఉందని, పనులు తుది దశకు వచ్చినందున గడువు లోగా పూర్తి చేస్తామని డీఈ సమాధానం ఇచ్చారు. అంతకుముందు ఎండీ, కలెక్టర్ బోటింగ్ చేశారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎస్‌ఈ సరిత, ఓఎస్‌డీ సంజయ్, డీఈ శ్రీధర్ పాల్గొన్నారు.



రామాలయంలో ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులకు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకుడు

రామయ్యను దర్శించుకున్న ఎండీ..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. ఈఓ బి.రమాదేవి శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఏఎస్పీ అంకిత్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని జీపీల్లో ఎకో బ్రిక్స్ తయారు చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ హీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎకో బ్రిక్స్ తయారు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా పంచాయతీల్లో ఎక్కువ మొత్తంలో బ్రిక్స్ తయారు చేసేలా ఎంపీడీఓలు, ఎంపీఓలు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో ఎకో బ్రిక్స్ తయారు చేసిన గ్రామపంచాయతీల ఫొటోలను ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఆర్‌డీఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ బ్రిక్స్ తయారు చేసిన పది పంచాయతీలను గుర్తించి అక్టోబర్ 1న ఆయా కార్యదర్శులను కలెక్టరేట్‌లో సన్మానిస్తామని, మెమెంటో బహూకరిస్తామని ప్రకటించారు.

రేపటి సమావేశానికి హాజరవ్వాలి

కొత్తగూడెంఅర్బన్: ఇన్‌స్పైర్ మనాక్ – 2024 రిజిస్ట్రేషన్, నామినేషన్లను అప్‌లోడ్ చేయని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు సోమవారం నిర్వహించే సమావేశానికి విధిగా హాజరవ్వాలని డీఈఓ వెంకటేశ్వరాచారి సూచించారు. హాజరు కాకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పాత కొత్తగూడెంలోని ఆనందఖని పాఠశాలలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. హాజరయ్యే ఉపాధ్యాయులు పాఠశాల యూడైస్ నంబర్లు, విద్యార్థుల ఫొటోలు, ఫోన్, ఆధార్ కార్డు నంబర్లు తీసుకుని రావాలని ఆదేశించారు. నామినేషన్ చేయని పాఠశాలల వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

భవన నిర్మాణాల్లో వేగం పెంచండి



యూబీ రోడ్డులో అసంపూర్తి భవనాన్ని పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం/భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న భవనాల పనుల్లో వేగం పెంచాలని, వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. శనివారం ఆయన భద్రాచలంలోని యూబీ రోడ్‌లో అసంపూర్తి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణాలు పూర్తి చేసి అద్దెలకు అందుబాటులో ఉంచితే గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతుందని అన్నారు. ప్రభుత్వ భూముల్లో షాపింగ్‌మాల్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ ఈఓ శ్రీనివాసరావును ఆదేశించారు. భద్రాచలానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారని, వారికి అవసరమయ్యే నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకు అందుబాటులో ఉంచితే ఇక్కడే కొనుగోలు చేస్తారని అన్నారు. గోదావరి వరదల సమయంలో చర్ల రోడ్, జగదీష్ కాలనీలో సైడ్ డ్రెయిన్‌లు తెగి ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కొత్త వాల్స్ నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజనీర్లతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. పట్టణంలోని వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, సఫాయి వర్కర్లు, శానిటేషన్ సిబ్బందితో పనులు చేయించాలని అన్నారు.

రేపు రెస్క్యూ పోటీ పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం) సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలోని ఇల్లెందు, మణుగూరు కొత్తగూడెంలో రెస్క్యూ టీమ్ ఏర్పాటుకు సోమవారం పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు అధికారులు శనివారం ఒక విడుదల చేశారు. కొత్తగూడెంలోని రెస్క్యూ స్టేషన్‌లో నిర్వహించే పరీక్షలకు ఆసక్తి గల అభ్యర్థులు 30వ తేదీ ఉదయం 8 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు. పోటీలో పాల్గొనే ఉద్యోగులను ఆయా గనులు /డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలు రిలీవ్ చేయాలని సూచించారు.

పల్లె ఓటర్లు | 6,23,947 మంది

- జిల్లా వ్యాప్తంగా మహిళలే అధికం
- గ్రామాల్లో తుది ఓటరు జాబితా ప్రచురణ



ఓటర్ల జాబితా సవరణ చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వార్డుల విభజన, ఓటరు జాబితా సిద్ధం చేసేలా నెల క్రితమే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ వెలువరించింది. ఈ మేరకు అధికారులు ఈనెల 13న గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటర్ జాబితాలు ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించారు. సవరణల అనంతరం శనివారం తుది ఓటర్ జాబితాలను గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా భద్రాచలం, సారపాక మినహా మిగిలిన జీపీల్లో తుది ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచారు. ఈ 479 పంచాయతీల పరిధిలో 4,232 వార్డులు, 6,23,947 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో పురుషులు 3,04,264, మహిళలు 3,19,660, ఇతరులు 23 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా పురుషుల కంటే 15,396 మంది మహిళలు అధికంగా ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలిలా..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆళ్లపల్లి	4,554	4,541	0
అన్నపురెడ్డిపల్లి	8,246	8,381	0
అశ్వాపురం	15,945	16,963	0
అశ్వారావుపేట	22,654	23,964	6
బూర్గంపాడు	14,999	15,715	3
చండ్రుగొండ	11,517	11,980	1
చర్ల	15,342	16,572	3
చుంచుపల్లి	18,884	19,895	6
దమ్మపేట	21,046	22,789	0
దుమ్ముగూడెం	17,100	18,908	1
గుండాల	6,492	6,453	0
జూలూరుపాడు	13,521	14,056	0
కరకగూడెం	6,331	6,366	0
లక్ష్మీదేవిపల్లి	15,559	16,233	1
మణుగూరు	17,800	18,156	0
ములకలపల్లి	13,573	14,059	0
పాల్వంచ	13,735	14,655	1
పినపాక	13,049	13,836	0
సుజాతనగర్	11,263	11,636	1
టేకులపల్లి	20,298	20,770	0
ఇల్లెందు	22,356	23,732	0

ప్రస్తుతం ప్రత్యేకాధికారులే..

ఈ ఏడాది జనవరితో గ్రామ సర్పంచుల పదవీకాలం ముగియగా ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారులే గ్రామాల్లో పాలన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారి పేర్ల నమోదుతో పాటు వలస వెళ్లిన, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించింది. అయితే ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని వారికి ఎన్నికల ప్రకటన వచ్చేవరకు ఈసీ మరోసారి కూడా అవకాశం కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.

పొరపాట్లకు తావులేకుండా..



పంచాయతీ ఎన్నికలకు ఓటర్ జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నెల రోజుల పాటు తీవ్రంగా శ్రమించి తుది ఓటరు జాబితాకు కసరత్తు చేశారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా తుది జాబితాలు సిద్ధం చేశారు.

– కె.చంద్రమౌళి, డీపీఓ

బీటీపీఎస్ జీటీ చెన్నైకి తరలింపు



జీటీని లారీలో చెన్నైకి తరలిస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్: మణుగూరు – పినపాక మండలాల మధ్య నిర్మించిన బీటీపీఎస్‌లో గత జూన్ 29న రాత్రి పిడుగుపాటుతో యూనిట్–1 జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్(జీటీ) దగ్ధమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతుల నిమిత్తం చెన్నైలోని శ్రీ పెరంబదూర్‌కు తరలించే ప్రక్రియను శనివారం ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చి యూనిట్–1ను పునరుద్ధరించాలని జెన్‌కో అధికారులు మొదట యోచించారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ బుష్‌లతో పాటు ఈ యూనిట్‌లోని కనెక్షన్ హెచ్‌ఎల్‌వీ సైడ్ డైమెన్షన్ మోడల్ భిన్నంగా ఉండటంతో ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. కాగా, దగ్ధమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేస్తే యథాస్థితికి చేరుకునే అవకాశం ఉందనే విశ్లేషకుల అభిప్రాయంతో రిపేర్ చేసేందుకు ఓపెన్ టెండర్ నిర్వహించారు. చెన్నైలోని అభిరామి ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థ టెండర్ దక్కించుకోవడంతో జీటీని అక్కడికి తరలించారు. బీటీపీఎస్ నుంచి శనివారం బయలుదేరిన ట్రాన్స్‌ఫార్మర్ 15 రోజులకు చెన్నై చేరే అవకాశం ఉంది. మరమ్మతుల అనంతరం తిరిగి యూనిట్–1 పునరుద్ధరణకు మరో నాలుగు నెలలు పట్టొచ్చని తెలుస్తోంది.

క్లుప్తంగా

రామగుండం ప్లాంట్ నిర్మాణం జెన్‌కోకు అప్పగించాలి



కేటీపీఎస్ 7వ దశ గేటు ముందు నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన 800 మెగావాట్ల రామగుండం థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని సింగరేణితో జాయింట్ వెంచర్ కాకుండా కేవలం జెన్‌కోకు మాత్రమే అప్పగించాలని పలు విద్యుత్ ఇంజనీర్ల, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. నిరవధిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం జేఏసీ ఆధ్వర్యంలో కేటీపీఎస్ 7వ దశ గేటు ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెన్‌కో మనుగడను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మధుబాబు, రవి, మహేష్, రాజేందర్, రాధాకృష్ణ, మజీద్, యాకూబ్, సయ్యద్, ధనయ్య, యాస్మిన్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బ్యాంబో క్లస్టర్‌కు బెండాలపాడు డైరెక్టర్లు



మల్కాపూర్‌లోని బ్యాంబోహౌస్‌లో వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న డైరెక్టర్లు

చండ్రుగొండ : మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబో క్లస్టర్ డైరెక్టర్లు శనివారం హైదరాబాద్‌లోని క్లస్టర్ సందర్శనకు వెళ్లారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని మల్కాపూర్‌లో ఉన్న బ్యాంబో హౌస్‌లో సందర్శించి, వెదురు ఉత్పత్తుల తయారీని పరిశీలించారు. ఐటీడీఏ జేడీఎం హరికృష్ణ, డైరెక్టర్లు బొర్రా సురేష్, కారం అన్వేష్, చీదర ప్రసాద్ వెళ్లినవారిలో ఉన్నారు.

సమీకృత వ్యవసాయం లాభదాయకం



రావికంపాడులో మునగ పంటను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చండ్రుగొండ: సమీకృత వ్యవసాయవిధానం రైతులకు లాభదాయకమని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. మండలంలోని రావికంపాడులో శనివారం ఆమె పర్యటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.లక్ష రుణసాయంతో రైతు నిజాంపట్నం కోటయ్య సేద్యం చేస్తున్న మునగ పంటను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు లాభాలు పొందాలన్నారు. ఆధునిక సేద్యం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఈజీఎస్ ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి డివిజన్‌స్థాయి క్రీడా ఎంపికలు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో బాలబాలికలు 14 సంవత్సరాల లోపు లేదా, 8వ తరగతి లోపు చదువుతుండాలని పేర్కొన్నారు. సీనియర్స్ విభాగంలో బాలబాలికలు 17 సంవత్సరాల లోపు వయసు ఉండి, 2008లో పుట్టిన తేదీ సర్టిఫికెట్ కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 29, 30వ తేదీల్లో పోటీలు నిర్వహిస్తామని, ప్రతి పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులకు మాత్రమే పాల్గొనాలని వివరించారు. ఎంపికలకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో రావాలని సూచించారు. పోటీల నిర్వహణకు డివిజన్ల వారీగా ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు.

1న ఉమ్మడి జిల్లాస్థాయిలో..

కొత్తగూడెంఅర్బన్: వచ్చే నెల 1న జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అండర్–14 బాలురకు క్రికెట్, కొత్తగూడెంలో అండర్–17 బాలుర ఫుట్‌బాల్ జట్టు, అండర్–14, 17, 19 బాలబాలికల రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమోతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 99512 74678 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

వెంటాడుతున్న 'మహిళా కోష్' రుణాలు

- 2006లో ఉమ్మడి జిల్లాలోని 14 మండలాలకు రూ.7 కోట్లు
- కొన్నేళ్ల తర్వాత నిలిచిపోయిన రుణ రికవరీ
- తరచుగా ఢిల్లీ కోర్టు నుంచి నోటీసులు.. తాజాగా మరోసారి
- ఆందోళనలో మహిళా సమాఖ్యల సభ్యులు





చండ్రుగొండలోని సెర్ప్ కార్యాలయం (ఇన్‌సెట్) మహిళా సమాఖ్యలకు ఢిల్లీ కోర్టు జారీ చేసిన నోటీసులు

చండ్రుగొండ: మహిళా సమాఖ్యల్లోని సభ్యుల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్రీయ మహిళా కోష్ ద్వారా మంజూరైన రుణాల రికవరీపై (ఢిల్లీకి చెందిన ఎన్‌జీఓ) దృష్టి సారించింది. చండ్రుగొండ మండల సమాఖ్య బాధ్యులకు శుక్రవారం నోటీసులు రావడంతో సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. సెర్ప్ అధికారులా లేక పాలకుల నిర్లక్ష్యమో తెలియదు కానీ సభ్యులు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

మండలానికి రూ.50 లక్షల చొప్పున..

ఉమ్మడి జిల్లాలోని 14 మండలాల్లో మహిళా సమాఖ్యలకు ఢిల్లీకి చెందిన ఎన్‌జీఓ 2006లో రాష్ట్రీయ మహిళా కోష్ పేరిట రుణాలు మంజూరు చేసింది. చండ్రుగొండ, కొత్తగూడెం, ముల్కలపల్లి, దమ్మపేట, సత్తుపల్లి, మధిర, వేంసూరు, బోనకల్లు, చింతకాని, గార్ల, కామేపల్లి, ఖమ్మంరూరల్, ముదిగొండ, తిరుమలాయపాలెం మండలాల్లోని సమాఖ్యలకు మండలానికి రూ.50 లక్షల చొప్పున రుణాలు రెండు విడతలుగా ఇచ్చారు. ఈ సమయాన ఎన్‌జీఓ బాధ్యులు మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారిని ఢిల్లీ పిలిపించి వారినే బాధ్యులను చేస్తూ రుణ మొత్తాలను అప్పగించారు. ఆ నిధులను గ్రామ సమాఖ్యకు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పంపిణీ చేశారు. అయితే, ఈ రుణ వాయిదాలను సభ్యులు 2011 వరకు సక్రమంగానే చెల్లించారు. అయితే, 2011 తర్వాత మండల సమాఖ్యలకు ఎన్నికలు జరగడంతో కొత్త వారు ఎన్నికయ్యారు. అంతేకాక ఇందిరా క్రాంతి పథం అధికారులు, సిబ్బంది బదిలీలపై ఇతర చోట్లకు వెళ్లిపోవడంతో రాష్ట్రీయ మహిళా కోష్ రుణ వాయిదాల చెల్లింపులను ఎవరూ పట్టించుకోలేదు.

కోర్టును ఆశ్రయించిన సంస్థ

రుణ వాయిదాలు అందకపోవడంతో ఎన్‌జీఓ సంస్థ ఢిల్లీలోని మెట్రోపాలిటిన్ కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమాన 2014లో కోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసుల బృందం జిల్లాలోని మండల సమాఖ్య సభ్యుల ఇళ్లకు వచ్చి నోటీసులు ఇచ్చారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అటు ప్రభుత్వం, ఉన్నతాధికారులకు చేరవేయగా పరిశీలన చేపట్టినా అడుగు ముందుకు పడలేదు. ఆ కేసు కొనసాగుతుండగానే తాజాగా ఢిల్లీకి చెందిన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి మళ్లీ నోటీసులు జారీ అయ్యాయి. అక్టోబర్ 18వ తేదీలోగా అసలుతో పాటు వడ్డీ చెల్లించని పక్షంలో అరెస్టు వారెంట్లు జారీ అవుతాయని అందులో ఉండటంతో మహిళా సమాఖ్య బాధ్యుల్లో వణుకు పుడుతోంది.

నిధులు గోల్‌మాల్ అయ్యాయా?

2011 తరువాత రికవరీ ఎందుకు ఆగిపోయిందనే అంశంపై అటు సభ్యులు, ఇటు అధికారుల వద్ద సమాచారం లేదు. సభ్యులు చెల్లించినప్పటికీ అప్పటి అధికారులు, సిబ్బంది కాజేశారా..? లేదా గ్రామ సమాఖ్యల బాధ్యులే కట్టలేదా అనేది తేలడం లేదు. మొత్తం 14 మండలాల్లో ఇదే సమస్య ఉండగా, రుణాల మంజూరు, రికవరీకి సంబంధించి రికార్డులు ప్రస్తుతం సెర్ప్ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. ఈ మేరకు ఢిల్లీ కోర్టు నుంచి సమన్లు రావడంతో చండ్రుగొండ సమాఖ్య మాజీ అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మ, కోశాధికారి కాంతకుమారి కలిసి మాలమహానాడు బాధ్యులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. 2011తో తమ పదవీకాలం ముగియగా బాధ్యతల నుంచి తప్పుకున్నామని అందులో పేర్కొన్నారు. ఈ ఉదంతంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

తడిచి మోపెడైన వడ్డీ

మహిళా సమాఖ్యలు తీసుకున్న రుణాల వడ్డీ ప్రస్తుతం భారీగా పెరిగింది. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితులు ఎదురవుతున్నాయి. చండ్రుగొండ మండలంలోని 32 సంఘాలకు రూ.50 లక్షలు రుణాలు ఇచ్చారు. అందులో 2011 వరకు రూ.37 లక్షలు తిరిగి చెల్లించారు. మిగతా రూ.13 లక్షల వరకు అసలు చెల్లించాల్సి ఉండగా.. అది వడ్డీతో కలిపి రూ.47 లక్షలకు చేరింది. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని 13 మండలాల్లో నెలకొంది.

జిల్లా అధికారులకు నివేదించాం



రాష్ట్రీయ మహిళా కోష్ రుణాల రికవరీ అంశం తీవ్ర రూపం దాల్చిన విషయం వాస్తవమే. ఇప్పటికే చండ్రుగొండ మండల సమాఖ్య మాజీ బాధ్యులకు నోటీసులు అందాయి. దీంతో సమస్య తీవ్రతను జిల్లా అధికారులకు నివేదించాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల మేరకు స్పందిస్తాం. –సంతోష్‌కుమార్, సెర్ప్ ఏపీఎం

ఏం చేయాలో అర్థం కావడం లేదు



ఢిల్లీ కోర్టు నుంచి నోటీసులు వస్తున్నాయి. తాజాగా మరో నోటీసు వచ్చింది. రూ.లక్షల నగదు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మేము ఢిల్లీకి ఎలా వెళ్లాలి. అక్కడి కోర్టుల చుట్టు ఎలా తిరగగలం. అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

–తంబళ్ల సీతమ్మ, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, చండ్రుగొండ

ఆందోళనగా ఉంది..



ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అప్పుడు గ్రామ సమాఖ్యలకు ఇచ్చిన రుణాలు చెల్లించకపోవడంతో మమ్ముల్ని బాధ్యులుగా చేశారు. అక్టోబర్ 18 వరకు చెల్లించకుంటే జైలుకు వెళ్లాలని నోటీసులో ఉందని చెబుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలి.

–పి.కాంతకుమారి, సమాఖ్య కోశాధికారి, అన్నపురెడ్డిపల్లి మండలం

జీపీ కార్మికుడి బలవన్మరణం

అధికారుల వేధింపులే కారణమా..?



నారాయణ(ఫైల్)

ములకలపల్లి: గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గిరిజనుడు పొడియం నారాయణ (57) శనివారం తెల్లవారుజామున ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విధి నిర్వహణలో అధికారుల వేధింపులే మృతికి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ములకలపల్లి ఠాణా ఎస్‌హెచ్‌ఓ లక్ష్మణ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతారాంపురం జీపీ వర్కర్‌గా విధులు నిర్వహించే పొడియం నారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పారిశుద్ధ్యానికి సంబంధించిన పనులు పెరిగిపోవడంతో పూర్తిస్థాయిలో పనులు చేయలేకపోతున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయి శనివారం తెల్లవారుజామున ఇంటి ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మహాలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రూ. 1.30 లక్షలకు సర్దుబాటు చేశారా..?

నారాయణ బలవన్మరణానికి అధికారుల వేధింపులే కారణమనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రెండు రోజులుగా పనుల విషయంలో జీపీ కార్యదర్శితోపాటు, ఆయా శాఖల అధికారులు తీవ్రంగా వేధించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం ఎంపీఓను సైతం కలిసినట్లు సమాచారం. మృతుడు నారాయణ జేబులో ఎంపీడీఓ, ఎంపీఓ పేరిట ఉన్న ఓ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. లేఖలో ఉన్న విషయం బహిర్గతమైతే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. కాగా మండలస్థాయిలో పనిచేసే ఓ అధికారితోపాటు సీతారాంపురం జీపీ బాధ్యులు మంతనాలు జరిపి రూ. 1.30 లక్షలు సర్దుబాటు చేసి, రాజీ కుదిర్చారనే ప్రచారం కూడా సాగుతోంది. వేధింపుల ఘటనపై ఇన్‌చార్జి ఎంపీడీఓ మహాలక్ష్మిని వివరణ కోరగా.. వేధింపుల విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల కేసు వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): సివిల్ జడ్జి కోర్టులో సాగుతున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల కేసు వచ్చే నెల 16వ తేదీకి వాయిదా పడింది. సమస్యలపై కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు కోర్టులో పిటిషన్ వేశారు. శనివారం కేసు విషయంలో వాదోపవాదాలు జరిగాయి. కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని న్యాయమూర్తి సూచించగా, సింగరేణి యాజమాన్యంతో చర్చిస్తామని న్యాయవాది తెలిపారు. దీంతో జడ్జి కేసు వాయిదా వేసినట్లు కార్మిక నాయకుడు రాసూరి శంకర్ తెలిపారు.

గ్రామస్తురాలికి సీఆర్‌పీఎఫ్ క్యాంపులో వైద్యం

చర్ల: మండలంలోని కలివేరు గ్రామానికి పొడియం రామలక్ష్మి జారి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని కుటుంబ సభ్యులు గ్రామంలోని సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపు వైద్యశాలకు తీసుకురాగా డాక్టర్ నీరజ్‌పాండే చికిత్స అందించారు. కాగా వైద్య సహాయం అందించిన సీఆర్‌పీఎఫ్ వైద్య బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ఇద్దరు అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు

అశ్వారావుపేటరూరల్: గుప్త నిధుల కోసం ఓ ఇంట్లో తవ్వకాలు జరుపుతుండగా శనివారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై యాయతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామంలోగల నల్లపు అనంత శేషుకు చెందిన ఇంట్లో ఇతనికి తెలియకుండా మేనత్త రోజారాణి హైదరాబాద్ నుంచి కొందరు వ్యక్తులను తీసుకొచ్చి గుప్త నిధుల కోసం పూజలు చేయించి, తవ్వకాలు జరిపిస్తోంది. గమనించిన చుట్టు పక్కలవారు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న తవ్వకాలు చేస్తున్న వారిలో ఇద్దరిని అరెస్ట్ చేశారు. కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ తవ్వకాలు జరిపిన వారిలో మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది మధ్య శనివారం ఘర్షణ జరిగింది. పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా కేసులు నమోదు చేసినట్లు భద్రాచలం ఎస్‌ఐ పీవీఎస్ రావు తెలిపారు.

ఆర్‌ఎంపీపై దాడి

ఇల్లెందురూరల్: ఆర్‌ఎంపీపై దాడి ఘటనలో శనివారం కేసు నమోదైంది. మండలంలోని పోలారం పంచాయతీ భద్రుతండాకు చెందిన రమేష్ అనారోగ్యంతో ఉన్న తన కుమారుడిని పోచారం తండాలోని ఆర్‌ఎంపీ అఖిల్‌అహ్మద్ వద్దకు తీసుకొచ్చాడు. ఈ క్రమంలో వైద్యం త్వరగా చేయాలని ఘర్షణ పడుతూ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కొమరారం పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: గట్టుగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 12,350 రూపాయల నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

టపాసులు స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.8 లక్షల విలువైన దీపావళి టపాసులను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది.

మహిళ ఆత్మహత్య

గుండాల: భర్త చనిపోవడంతో మనోవేదనకు గురై ఓ మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పోతిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఈసం పుల్లమ్మ(50) భర్త ఏడాది క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలోనే అప్పుడప్పుడు మద్యం తాగుతోంది. శనివారం మద్యం మత్తులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లడంతో 108 ద్వారా కుటుంబ సభ్యులు గుండాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజమౌళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు.

జూలూరుపాడులో...

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామ పంచాయతీ దుబ్బతండాకు చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ బి తిరుపతిరావు కథనం ప్రకారం.. దుబ్బతండాకు చెందిన భూక్యా బాలు(47) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యంమత్తులో పురుగుల మందు తాగగా, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

14 కేజీల గంజాయి సీజ్



గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పాల్వంచ: ఇద్దరు మైనర్లు స్కూటీపై గంజాయి తరలిస్తూ శనివారం పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా నుంచి విజయవాడకు స్కూటీపై గంజాయి తరలిస్తుండగా పట్టణ ఎస్‌ఐలు సుమన్, రాఘవయ్య బీసీఎం రోడ్‌లో ఇందిరా కాలనీ సమీపంలో పట్టుకున్నారు. రూ. 3 లక్షల విలువైన 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్నది విజయవాడ చిట్టినగర్‌కు చెందిన ఇద్దరు మైనర్లుగా గుర్తించామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు. వీరిపై గతంలో కూడా గంజాయి నమోదై ఉందని పేర్కొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: రెండు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న 14 కేజీల గంజాయిని శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో రెండు బైక్‌లపై ఐదుగురు యువకులు గంజాయి తీసుకెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కొత్తగూడేనికి చెందిన రామాంజనేయులు, దొమ్మటి మధు, ముప్పాల అభిషేక్, పెద్దాటి నాగరాజు, తాళ్ళూరి యశ్వంత్‌తోపాటు సికింద్రాబాద్‌కు చెందిన జక్రిపోతుల శివకేశవ ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు భద్రాచలం ఎక్సైజ్ సీఐ షేక్ రహీమున్నీసా బేగం, ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై యాయతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామంలో ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అశ్వారావుపేట శివారులో గుర్తించి పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. యజమానులు ప్రవీణ్, రమేష్‌తోపాటు, ట్రాక్టర్ల డ్రైవర్లు విజయ్‌కుమార్, వీరబాబు, శివలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

స్వచ్ఛత వైపు అడుగులు వేయాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

గుండాల: ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగు వేయాలని జిల్లా పరిషత్ సీఈఓ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం గుండాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పూలతో ఏర్పాటు చేసిన పడవను గుండాల ఊర చెరువులో వదిలారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించి విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రూపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్యాం సుందర్ రెడ్డి, ఏపీ రవితేజ, ఉపాధి హామీ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాను స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ బన్న ఐలయ్య

ప్రొఫెసర్ బన్న ఐలయ్య

ఇల్లెందురూరల్: మహాకవి గుర్రం జాషువాను స్ఫూర్తిగా తీసుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ బన్న ఐలయ్య పేర్కొన్నారు. ఖమ్మం జాషువా సాహిత్య వేదిక, ఇల్లెందు, టేకులపల్లి, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సాహితి జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాకవి గుర్రం జాషువా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో ఐలయ్య మాట్లాడారు. బలహీన వర్గాల కుటుంబంలో జన్మించిన జాషువా అనేక ఆటుపోట్లను అధిగమించి మహాకవిగా ఎదిగారని గుర్తుచేశారు. నేడు చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అది జీవితం కాదని స్పష్టం చేశారు. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ రామలింగేశ్వరరావు, నాగిరెడ్డి, విజయకుమారి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పగిడిపల్లి వెంకటేశ్వర్లు, అశోక్ మోరె, జాషువా సాహిత్య వేదిక సభ్యులు జయవాసు, షేక్ నయిమ్, పాషా, కోండ్రు బ్రహ్మం, సుధారాణి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురం ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కరకగూడెం: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కరకగూడెం మండలంలోని శ్రీరంగాపురం ఎంపీపీఎస్ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) చందూలాల్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చందూలాల్ నిబంధనలకు విరుద్ధంగా తరగతి గదిలో మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతున్న వీడియో క్లిప్ ఈ నెల 20న సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. దీంతో సీసీఏ రూల్స్ ప్రకారం సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు. ఈ ఉత్తర్వు అమలులో ఉన్నంతవరకు కొత్తగూడెంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు తీసుకునేటప్పుడు మాత్రమే పాఠశాలలకు పంపిణీ చేసిన ట్యాబ్ వినియోగించాలని, దాని ద్వారా ఇబ్బంది ఉంటే సెల్ ఫోన్ ఉపయోగించాలని తెలిపారు. అది కూడా కేవలం పాఠశాల మొదటి పీరియడ్‌కు మాత్రమే అవకాశమని, ఉపాధ్యాయులు విధిగా తమ సెల్ ఫోన్లను ప్రధానోపాధ్యాయుడి వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశించారు.

అస్తమాతో ఇద్దరు చిన్నారుల మృతి

పినపాక: అస్తమాతో శ్వాస ఆడక రెండు నెలల పాప, బాబు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మద్దులగూడెంలో శనివారం విషాదం నింపింది. వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు పిల్లలు ఒకేరోజు ఒకే కారణంతో మృతి చెందడం అందరినీ కంటతడి పెట్టించింది. గ్రామానికి చెందిన ప్రసాద్ – మరియమ్మ దంపతుల రెండు నెలల పాపకు శ్వాస ఆడకపోవడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన మంజు – మహేష్ దంపతుల బాబు కూడా అదే సమస్యతో బాధపడుతూ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. ఇద్దరూ శనివారం సాయంత్రం మృతి చెందారు. దీంతో ఇరుకుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.